

భూ సేకరణకు భూముల పరిశీలన

జీలుగుమిల్లి : పోలవరం ప్రాజెక్టు ముంపులో భాగంగా అల్లూరి సీతారామ రాజు జిల్లా చింతూరు డివిజన్ పరిధిలోని కొండ్రాజుపేట గ్రామం ముంపునకు గురవడంతో అక్కడి నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ నిమిత్తం భూమికి భూమి, ఇంటి నిర్మాణానికి స్థలాలు ఇవ్వడానికి జీలుగుమిల్లి పరిసర గ్రామాల్లో ఉన్న రెవెన్యూ భూములను గురువారం పరిశీలించారు. పిఒ అపూర్వ భరత్‌తో పాటు స్పెషల్ కలెక్టర్ సరళ వందనం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బాలరామకృష్ణతో పాటు రెవెన్యూ అధికారుల బృందంతో పాటు గ్రామస్తులు భూములను పరిశీలించారు. పిఒ అపూర్వ భరత్ మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 400 ఎకరాల వరకు భూములను పరిశీలించినట్లు తెలిపారు. ఇంకా కొన్ని వందల ఎకరాల భూమి అవసరం ఉంటుందని చెప్పారు. దీనికి సంబంధించి మండలంలో ఎటువంటి వివాదాలు లేకుండా ఉన్న గిరిజనేతర భూములను సేకరించాలని ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఉదయ్‌భాస్కర్ కు ఆదేశించారు. ఈ కార్యక్రమం లో రెవెన్యూ సిబ్బంది,విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

ఉపాధి బకాయిలకు మోక్షం..!

- నెలా 20 రోజుల నుంచి ఉపాధి శ్రామికులకు అందని వేతనాలు
- ఏలూరు జిల్లాలో రూ.124 కోట్లు, పశ్చిమలో రూ.45 కోట్లు పెండింగ్
- ఏప్రిల్ నుంచి రెండు జిల్లాల్లో 31 లక్షల పని దినాలు నమోదు
- ఉపాధి హామీ వేతన సొమ్ము విడుదలైనట్లు డ్వామా అధికారులు వెల్లడి
- వారంలోపే శ్రామికుల ఖాతాల్లో జమయ్యే అవకాశం
- వేతనాల ఆలస్యంపై ఉపాధి శ్రామికుల్లో తీవ్ర అసహనం



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉపాధి శ్రామికులకు ఎట్టకేలకు కూలి డబ్బులు అందనున్నాయి. గడిచిన నెలా 20 రోజులుగా చేసిన పనికి కూలి సొమ్ము అందకపోవడంతో ఉపాధి శ్రామికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చేసిన పనులను ఎప్పటికప్పుడు డ్వామా అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసి పంపిస్తున్నా సొమ్ము విడుదలలో కేంద్ర ప్రభుత్వం తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తోంది. సకాలంలో కూలి సొమ్ము అందక ఉపాధి శ్రామికులకు కుటుంబ పోషణ కష్టంగా మారుతోంది. రెక్కాడితే తప్ప డొక్కాడని కుటుంబాలు ఎక్కువ. వారానికి సొమ్ము అందితేనే బతుకు బండి నడుస్తుంది. ఉపాధి కూలి సొమ్ము నెలలు తరబడి పెండింగ్ పెట్టడంతో శ్రామికులు ఆర్థికంగా నలిగిపోతున్నారు. రెండు జిల్లాల్లోనూ ఏప్రిల్ 14వ తేదీ తర్వాత ఉపాధి శ్రామికులకు కూలి సొమ్ము అందలేదు. దీంతో వారంతా కూలి డబ్బుల కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. ఏలూరు జిల్లాలో 4.85 లక్షల వరకూ జాబ్‌కార్డుదారులు పని చేస్తున్నారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఇప్పటి వరకూ 55 లక్షల పని దినాలు చూపారు. ఉపాధి శ్రామికులకు వేతనాల కింద రూ.124 కోట్లు వరకూ రావాల్సి ఉంది. పశ్చిమగోదావరి జిల్లాలో ఏప్రిల్ నుంచి 16 లక్షల పని దినాలు జరగ్గా, రూ.45 కోట్లు వరకూ ఉపాధి శ్రామికులకు వేతనాలు అందాల్సి ఉంది. నెలా 20 రోజులగా కూలి సొమ్ము అందకపోవడంతో శ్రామికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్వామా అధికారులపైన శ్రామికుల నుంచి తీవ్రమైన ఒత్తిడి పెరిగింది. ఉపాధి వేతనాలు సకాలంలో చెల్లించాలని శ్రామికులు కోరుతున్నారు.

ఎట్టకేలకు కూలి సొమ్ము విడుదల

ఉపాధి హామీ బకాయిల సొమ్ములు విడుదలైనట్లు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల డ్వామా అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి వేతన బకాయిల కింద రూ.వెయ్యి కోట్లు వరకూ విడుదలైనట్లు తెలిసింది. ఏలూరు జిల్లాకు రూ.124 కోట్లు, పశ్చిమకు రూ.45 కోట్లు వేతన బకాయిలు ఉన్నాయి. రెండు జిల్లాలకు పూర్తిస్థాయిలో వేతన బకాయిలు విడుదల అవుతాయా.. లేక ఇంకా పెండింగ్ ఉంటుందా అనేది తెలియాల్సి ఉంది. ఇప్పటికే ఉపాధి శ్రామికుల ఖాతాల్లో వేతన సొమ్ములు జమవుతున్నాయని, వారంలోపే శ్రామికులకు ఉపాధి వేతనాల సొమ్ము అందనుందని చెబుతున్నారు. కూలి సొమ్ము జమైన తర్వాత ఎన్ని పని దినాలకు చెల్లించారో స్పష్టత రానుంది. వేతన బకాయిల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవతీసుకుని త్వరితగతిన వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఉపాధి శ్రామికులు కోరుతున్నారు.

నేటి నుంచి డిఎస్‌సి పరీక్షలు

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్, భీమవరం

మెగా డిఎస్‌సి-2025 పరీక్షలు ఈ నెల ఆరో తేదీ శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలు ఈ నెల 30వ తేదీ వరకూ కొనసాగనున్నాయి. ఈ పరీక్షలకు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఆయా జిల్లా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఏలూరులోని వట్లూరులో సిద్ధార్థ క్వెస్ట్ పాఠశాలలోనూ, సిఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలోనూ, ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలలోనూ ఆన్‌లైన్ విధానంలో ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం రెండున్నర గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. టిసిఎస్ కంపెనీ ఈ పరీక్షలు నిర్వహించనుంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా మొత్తం 1035 ఉపాధ్యాయ పోస్టులను ఈ డిఎస్‌సి ద్వారా భర్తీ చేయనున్నారు. ఇందులో 837 ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లోని పోస్టులు ఉండగా, మున్సిపల్ పరిధిలో 153, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 45 పోస్టులు ఉన్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 25,750 మంది అభ్యర్థులు 42,466 దరఖాస్తులు చేశారు. ఇందులో 9,290 మంది పురుషులు, 16,460 మంది స్త్రీలు ఉన్నారు. ఏలూరు జిల్లాకు సంబంధించి ఏలూరులోని మూడు కేంద్రాల్లో 17,238 మంది అభ్యర్థులు డిఎస్‌సి పరీక్షలు రాయనున్నారు. అభ్యర్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ఇక పశ్చిమగోదావరి జిల్లాలో ఐదు కేంద్రాల్లో నిర్వహించే పరీక్షలకు 16,634 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. భీమవరం డిఎన్ఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, దంతులూరి నారాయణరాజు కాలేజీ, తాడేపల్లిగూడెం శ్రీ వాసవి ఇంజినీరింగ్ కాలేజీ, శశి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజినీరింగ్, నరసాపురంలో స్వర్ణాంధ్ర కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. హాల్‌టిక్కెట్‌తోపాటు ఆధార్ కార్డ్, పాన్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, ఏదో ఒక ఫోటో ఐడెంటిటీ కార్డును తప్పనిసరిగా తీసుకెళ్లాలి.

హాల్‌టిక్కెట్‌లో తప్పులు సరిదిద్దుకునే అవకాశం

డిఎస్‌సి హాల్‌టిక్కెట్‌లో ఏమైనా తప్పులు నమోదై ఉంటే సరిదిద్దుకునే అవకాశం ఉంది. ఏదైతే తప్పు నమోదైందో, దానికి సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్‌ను చూపించి, ధ్రువీకరించిన దాని జిరాక్స్ కాపీని అందజేసి, పరీక్ష కేంద్రం వద్దే సరిచేసుకోవచ్చు. తప్పులు సరిచేయించుకోవడానికి గంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి

ఎర్రకాలువ మిగులు భూముల్లో సాగు పనులు ప్రారంభం

దుక్కి దున్ని, విత్తనాలు చల్లి సాగు ప్రారంభించిన నేతలు, పేదలు

మిగులు భూములను పేదలకు పంచాలి: ఏపి వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి


టి.నర్సాపురం మండలంలో

ప్రజాశక్తి - టి.నర్సాపురం

ఎర్ర కాల్వ మిగులు భూములను పేదలకు పంచాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి డిమాండ్ చేశారు. మండలంలోని సాలిగూడెం సమీపంలో ఎర్రకాలువ మిగులు భూముల్లో సంఘం ఆధ్వర్యంలో గురువారం పేదలతో కలిసి దుక్కు దున్ని, విత్తనాలు చల్లి సాగు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ మిగులు భూముల్లో పేదలు సాగుకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. మండలంలోని బొర్రంపాలెం, మధ్యాహ్నపువారిగూడెం, సాలిగూడెం, తిరుమలదేవిపేట తదితర గ్రామాల్లో సుమారు 3,500 ఎకరాల వరకు ఎర్రకాలువ మిగులు భూమి ఉందన్నారు. ఆ భూమిని పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. పేదలంతా ఆ భూముల్లో విత్తనాలు చల్లి సాగు చేపట్టి మంచి దిగుబడులు సాధించాలని సూచించారు. సాగు చేస్తున్న గిరిజన, పేదలందరికీ హక్కు పత్రాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కార్యదర్శి పిల్లి రామకృష్ణ మాట్లాడుతూ పేదలంతా ఐక్యంగా పోరాడుతూ భూములు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం, నాయకులు గుడెల్లి వెంకట్రావు, మడకం సుధారాణి, కుమారి, అనుమోలు మురళి తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: ఎర్రకాలువ ఇరిగేషన్ ప్రాజెక్ట్ మిగులు భూముల్లో సాగును ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎ.రవి ప్రారంభించారు. గురువారం ఆ సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని ఎ.పోలవరం, చిన్నవారిగూడెం గ్రామాల ప్రాజెక్టు ఏరియాలో వర్షాలు కురవడంతో పేదలంతా ఐక్యంగా ఏరువాక సాగించి వరి సాగు చేసేందుకు దుక్కు దున్ని, విత్తనాలు చల్లి సాగు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం ఆధ్వర్యాన జరిగిన సభలో రవి, సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ ప్రాజెక్టు ముంపు లేని మిగులు భూముల్లో పేదలందరూ ఐక్యంగా సాగు ప్రారంభించాలన్నారు. ఇప్పటికే ఈ భూమిని పేదలు సాగు చేస్తున్నప్పటికీ ఈ సంవత్సరం వర్షాలు ముందుగా కురవడంతో విత్తనాలు చల్లి, నారుమడులు పోసి నాట్లకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇదే సందర్భంలో ఎర్రకాలువ ప్రాజెక్టు నిర్మాణం కోసం భూస్వాముల నుంచి వేలాది ఎకరాలు ప్రభుత్వం సేకరించిందని, భూములకు రూ.లక్షల కోట్లు పరిహారం చెల్లించిందని తెలిపారు. అయితే అప్పటి నుండి ఇప్పటి వరకు ముంపు లేని భూముల్లో భూస్వాములు వరి, మొక్కజొన్న, చెరకు, అరటి, జామాయిల్, పామాయిల్, కొబ్బరి పంటలు అక్రమ పద్ధతిలో ఇరిగేషన్ చట్టాలకు విరుద్ధంగా సాగు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవే భూముల్లో సాగుకు అవకాశం ఇవ్వాలని పేదలు అధికారులను కోరుతుంటే స్పందించకపోగా ఇరిగేషన్ చట్టాలను తుంగలో తొక్కి భూస్వాములకు కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. సంఘం ఆధ్వర్యంలో పేదలు గత ఎనిమిది సంవత్సరాల నుంచి ఈ భూముల్లో సాగు చేస్తున్నారన్నారు. సంఘం ఆధ్వర్యంలో హైకోర్టును ఆశ్రయించగా కోర్టు పేదల పక్షాన గత సంవత్సరం నవంబర్ 4న పేదలకు ఈ భూములు సాగు హక్కు ఇచ్చేలా తీర్పునిచ్చిందని, ఈ తీర్పును అధికారులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పేదలు సాగు చేస్తున్న భూములకు రక్షణ కల్పించాలని, భూస్వాములపై కేసులు బనాయించి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, పేదలు సాగు చేస్తున్న భూములను సాగు లెక్కల్లో నమోదు చేసి సాగుకు అవకాశం కల్పించాలని కోర్టు పేర్కొందని తెలిపారు. ఇప్పటికైనా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకుని పేదలు సాగు చేస్తున్న భూములకు రక్షణ కల్పించి భూమిపై సాగుహక్కు కల్పించాలని, పేదల వేసుకున్న పంటలను ధ్వంసం చేసిన భూస్వాములపై కేసులు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి ఏడాదైనా పేదలకు భూములు పంచే విషయంలో విఫలమైందని ఎద్దేవా చేశారు. చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కు భూముల కోసం వినతిచ్చినా ఫలితం దక్కలేదన్నారు. తక్షణమే ప్రభుత్వం, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు స్పందించి సాగుకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు యాగంటి సీత, గుడెల్లి వెంకట్రావు, ఎ.ప్రభాకర్‌రావు, జి.సూర్యకిరణ్, పిల్లి చంటి, కె.సుబ్బారావు, ఎర్రమాల కుమారి, బత్తుల వెంకన్న, బొక్కా వెంకటేష్, రెడ్డిబోయిన సత్యవతి, బెల్లంకొండ శివయ్య, పిల్లి పోతురాజు, పి.వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

'హరిత ఏలూరు' లక్ష్యం

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదాం : కలెక్టర్ కె.వెట్రిసెల్వి


మొక్క నాటి నీరు పోస్తున్న కలెక్టర్, ఎంఎల్ఎ

ప్రజాశక్తి - పోలవరం

పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కార్యోన్ముఖులు కావాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. గురువారం పోలవరం మండలం పట్టిసీమ గోదావరి ఒడ్డున 'ప్రపంచ పర్యావరణ దినోత్సవం' సందర్భంగా వనం-మనం కార్యక్రమంలో భాగంగా కలెక్టర్‌తోపాటు ఎస్‌పి కె.ప్రతాప్‌శివ కిషోర్, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, ఎంఎల్ఎ చిర్రి బాలరాజు తదితరులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మొక్కలు నాటుదాం... పర్యావరణాన్ని కాపాడుదాం అని ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతిని మనం కాపాడితే అదే మనల్ని కాపాడుతుందన్నారు. ఈ ఏడాది పర్యావరణ దినోత్సవ ప్రధాన అంశమైన ప్లాస్టిక్ కాలుష్య నియంత్రణకు కట్టుబడి ఉందామని, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నివారించే ప్రతిజ్ఞ తీసుకుందామని చెప్పారు. జిల్లాలో పెద్దఎత్తున మొక్కలు నాటడంతోపాటు ప్లాస్టిక్ వస్తువులు, క్యారీ బ్యాగుల వాడకానికి ప్రతిఒక్కరూ స్వస్తి చెప్పాలన్నారు. పరిసరాల పరిశుభ్రతను ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలని, అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలవాలని అన్నారు. మొక్కలను నాటడం ఎంత ముఖ్యమో, వాటి సంరక్షణ కూడా అంతే ముఖ్యమని అన్నారు. ప్లాస్టిక్ వస్తువులు, క్యారీ బ్యాగులు మానవాళికి తీవ్రహాని కలిగిస్తాయన్నారు. జిల్లాలో 4.50 లక్షల మొక్కలు నాటాలనే లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. జిల్లాలో పచ్చదనాన్ని గణనీయంగా పెంచడమే లక్ష్యంగా అందరూ కృషి చేయాలన్నారు. పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు మాట్లాడుతూ సహజ వనరులను రాబోయే తరాలకు అందించాలన్నదే ప్రభుత్వ దృక్పథమన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎంవి.రమణ, ఐటిడిఎ పిఒ కె.రాములునాయక్, జిల్లా అటవీశాఖ అధికారి శుభం, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, జిల్లా ఆయుష్ అధికారి కె.రాణి, జిల్లా పర్యాటక శాఖ మేనేజర్ ఎస్.పట్టాభిరామన్, తహశీల్దార్ సాయిరాజు, ఎంపిడిఒ శ్రీనివాసబాబు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

లాభాలబాటలోకి రైతు సేవా సహకార సంఘం

డిసిసిబి ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు


మొక్క నాటుతున్న గన్ని వీరాంజనేయులు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు రైతు సేవా సహకార సంఘాన్ని రానున్న రెండేళ్లలో లాభాలబాటలో పయనింపజేస్తానని డిసిసిబి ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు తెలిపారు. ఆయన గురువారం భీమడోలు రైతు సేవా సహకార సంఘాన్ని సందర్శించారు. వివిధ విభాగాల పనితీరు పరిశీలించారు. రైతులు, కూటమి నాయకులతో సంఘ అభివృద్ధి విషయమై పలు అంశాలపై చర్చించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సహకార సంఘం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా గన్ని మాట్లాడుతూ, మానవ మనుగడకు పర్యావరణ పరిరక్షణ ముఖ్యమన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని, వాటిని పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి కరణం పెద్దిరాజు, భీమడోలు మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఎస్ఎస్.గిరి, మాజీ ఛైర్మన్ డి.పుల్లయ్య నాయుడు, భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ సభ్యులు ఎం.సుబ్రహ్మణ్యం, మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ యలమర్తి రవీంద్రకుమార్, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

పేదల ఇళ్ల స్థలాల్లో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు తగదు

నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే నిర్మాణాన్ని అడ్డుకుంటాం

తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యాన లబ్ధిదారుల ధర్నా



తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నేతలు, లబ్ధిదారులు

ప్రజాశక్తి - మండవల్లి

పేదల ఇళ్ల స్థలాల్లో పోలీస్‌స్టేషన్ ఏర్పాటును ఉపసంహరించుకోవాలని, లేకుంటే పోలీస్‌స్టేషన్ నిర్మాణాన్ని అడ్డుకుంటామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శ్రీనివాస్ అన్నారు. తమ భూమిలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయవద్దని, మెరక చేసి పట్టాలిచ్చి ఇళ్లు నిర్మించుకునేలా చేయాలని కోరుతూ స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద లబ్ధిదారులు సిపిఎం ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి స్థలం కేటాయించడం దుర్మార్గమైన చర్య అన్నారు. 2006లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల స్థలాల పేరుతో లబ్ధిదారులను ఎంపిక చేసి రెండు విడతలుగా సుమారు 130 మందికి పట్టాలు ఇచ్చినట్లు చెప్పారు. ఆ ప్రాంతం లోతట్టుగా ఉండటంతో మెరక చేయండి పట్టాలన్నా ఇప్పిచ్చిండంటూ లబ్ధిదారులు గత 20 ఏళ్ల నుంచి కలెక్టర్లు, అధికారులు, ప్రజా ప్రతినిధుల చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోలేదన్నారు. 20 ఏళ్లుగా పోరాటం చేస్తున్నా పట్టించుకోకుండా పోలీస్ స్టేషన్‌కు స్థలం ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. లబ్ధిదారులకు గుడి, బడి, ఆటస్థలం, కమ్యూనిటీ హాలుకు ఏర్పాటు చేయాల్సిన స్థలాన్ని పోలీస్ స్టేషన్‌కు కేటాయిస్తూ పంచాయతీ తీర్మానం చేయడం సరైన పద్ధతి కాదన్నారు. పేదల ఇళ్ల స్థలాల్లో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తే లబ్ధిదారులు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. లబ్ధిదారులను ఇబ్బందులకు గురి చేసే విధంగా పంచాయతీ తీసుకున్న ఏకపక్ష నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. స్థలాలను మెరక చేసే విధంగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేకుంటే సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని, అవసరమైతే పోలీస్ స్టేషన్ నిర్మాణాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎడ్‌సెట్ పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

లా కాలేజీల్లో ప్రవేశాలకు నిర్వహించే లాసెట్, బిఇడి కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించే ఎడ్‌సెట్ పరీక్షలు జిల్లాలో గురువారం ప్రశాంతంగా జరిగాయి. ఏలూరు కేంద్రంగా వట్లూరులోని సి ఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, సిద్ధార్థ క్వెస్ట్ సిబిఎస్ఇ పాఠశాల, ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో లాసెట్ పరీక్షకు 507 మంది అభ్యర్థులకుగాను 419 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలుగు గంటల వరకు జరిగిన ఎడ్‌సెట్ పరీక్షకు మొత్తం 500 మందికి 339 మంది హాజరయ్యారు.

టెండర్ పద్ధతిన నియమించాలి

డిజిటల్ ట్రాఫిక్ నెంబర్లు తయారు చేసే ఏజెన్సీలను

ఆటో, ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు)



ఎఎస్‌పికి వినతిపత్రం అందిస్తున్న నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆటో రిక్షాలకు డిజిటల్ ట్రాఫిక్ నెంబర్లను తయారు చేసేందుకు ఏజెన్సీలను టెండర్ విధానం ద్వారా నియమించాలని ఆటో, ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చక్రాల అమర్‌కుమార్, జె.గోపీ కోరారు. ఈ మేరకు ఎస్‌పి కార్యాలయంలో అడిషనల్ ఎస్‌పి సూర్యచంద్రరావుకు సిఐటియు నాయకులు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో దాదాపు ఐదు వేల మంది ఆటో కార్మికులు ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణ సేవలందిస్తున్నారని తెలిపారు. గత నెల 13వ తేదీన ట్రాఫిక్ పోలీస్ వారు నిర్వహించిన ఆటో డ్రైవర్ల సమావేశంలో ఆటో రిక్షాలకు డిజిటల్ ట్రాఫిక్ నెంబర్లను తప్పక తీసుకోవాలని విజ్ఞప్తి చేశారన్నారు. డిజిటల్ ట్రాఫిక్ నెంబర్ల ద్వారా ప్రయాణికులకు భద్రత, నేరాల శాతాన్ని తగ్గించేందుకు అవకాశం ఉంటుందని, అందుకు సిఐటియు పూర్తి సహకారాన్ని అందిస్తుందని తెలిపారు. డిజిటల్ ట్రాఫిక్ నెంబర్లను తయారు చేసే ఏజెన్సీలను నియమించడంలో నామినేటెడ్ పద్ధతిని వారు వ్యతిరేకించారు. ప్రస్తుతం ట్రాఫిక్ డిపార్ట్‌మెంట్ వారు నియమించిన ఏజెన్సీ ప్రతి ఆటోకు రూ.50 అదనంగా వసూలు చేస్తుందని, ఐదు వేల ఆటోలకు రూ.50 చొప్పున అదనంగా వసూలు చేయడం ద్వారా రూ.2.50 లక్షలు ఆటో డ్రైవర్లు నష్టపోతున్నారని విమర్శించారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రూ.200 కే ట్రాఫిక్ డిజిటల్ నెంబర్లను తయారు చేసే ఏజెన్సీలు ఉండగా రూ.250 వసూలు చేసే సంస్థకు ట్రాఫిక్ నెంబర్లను తయారు చేసే కాంట్రాక్ట్ కట్టబెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. డిజిటల్ ట్రాఫిక్ నెంబర్ల ఏజెన్సీ నియామకం విషయంలో ఎస్‌పి పరిశీలించాలని, ఆటో కార్మికులు నష్టపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా రూ.200కే ఆటో రిక్షాలకు డిజిటల్ ట్రాఫిక్ నెంబర్లను తయారు చేసే టుడేస్ సేఫ్ జర్నీ డాట్ కాం సంస్థ వీడియోను మీడియా ప్రతినిధులకు, ఆటో కార్మికులకు విడుదల చేశారు.

ఐద్వా నేత కరుటూరి రాధ కన్నుమూత

నివాళులర్పించిన నేతలు


రాధ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - ఆచంట

ఐద్వా సీనియర్ నేత కరుటూరి రాధ (85) గురువారం ఆచంట వేమవరంలోని తన స్వగృహంలో ఆకస్మికంగా మృతి చెందారు. ఆమె భర్త కరుటూరి సత్యనారాయణ రైతుసంఘం నేతగా, సిపిఎం నేతగా జిల్లావాసులకు సుపరిచితులు. ఆయన గతంలో అనారోగ్యంతో మృతి చెందారు. ఈ దంపతులకు ఒక కుమార్తె అరుణ ఉన్నారు.

కరుటూరి రాధ మృతి పట్ల సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, రాష్ట్ర నేత మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ సంతాపం తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్, మండల కార్యదర్శి పి.మోహన్‌రావు, శాఖ కార్యదర్శి గుత్తుల రంగారావు, నాయకులు కొండేటి సత్యనారాయణ, సిర్రా విఘ్నేశ్వరుడు, సిర్రా నరసింహమూర్తి, అల్లుడు సత్యనారాయణ రాధ భౌతికకాయంపై సిపిఎం జెండా కప్పి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అంత్యక్రియలు శుక్రవారం ఉదయం ఏడు గంటలకు ఆచంటలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రాధ అకాల మృతి పట్ల ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు, ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కేతా పద్మజ, పి.పూర్ణ తదితరులు సంతాపం తెలిపారు.

రైతులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రైతులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని కాన్స్‌స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియా సమావేశ మందిరంలో అఖిల భారత రైతు సంఘం ఆధ్వర్యంలో వాతావరణ మార్పులు - రైతుల పురోగాభివృద్ధి అంశంపై గురువారం జరిగిన సమావేశానికి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఇప్పటి నుంచే ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఎఐ) వినియోగంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కచ్చితమైన వాతావరణ సూచనలు అందించడం, సీజన్ వారీగా పంట ఎంపికకు మార్గనిర్దేశం, పురుగు మందుల సిఫార్సు, పంట సమయాలను అంచనా వేయడానికి ఎఐ దోహదం చేస్తుందని ఎంపీ తెలిపారు. ఎఐ వినియోగం ద్వారా తక్కువ పెట్టుబడితో ఆశాజనకంగా పంట దిగుబడులు సాధించడానికి వీలు కల్పిస్తుందని పేర్కొన్నారు. రైతులు ఆధునిక సాంకేతిక వ్యవసాయ పద్ధతులు అవలంభించడం ద్వారా పెట్టుబడులు ఖర్చు తగ్గించుకునే వీలుందని ఎంపీ వెల్లడించారు. కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ఎన్‌డిఎ ప్రభుత్వాలు వ్యవసాయ రంగంలో వస్తున్న సాంకేతికతను అందిపుచ్చుకునేలా ప్రోత్సహిస్తుందని ఎంపీ స్పష్టం చేశారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన తనకు రైతుల సమస్యల పట్ల అవగాహన ఉందని, ఈ సమస్యలకు సాంకేతిక వినియోగం పరిష్కారం చూపుతుందని తెలిపారు.

దేదీప్యసాయికి ప్రతిభా పురస్కారం

నూజివీడు టౌన్ : ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జిల్లాల వారీగా ప్రకటించే ప్రతిభా పురస్కారాలను ప్రభుత్వం ప్రకటించిందని శ్రీ శారదా విద్యా సంస్థల ఛైర్మన్ కుప్పాల శంకరరావు, కరస్పాం డెంట్ కుప్పాల రాధిక తెలిపారు. పట్టణంలోని శ్రీ శారద విద్యాసంస్థల్లో వారు గురువారం మాట్లాడుతూ ఈ ప్రతిభా పురస్కారానికి జిల్లా నుంచి జనరల్ కేటగిరీలో నూజివీడు శ్రీశారద జూనియర్ కళాశాలకు చెందిన కుప్పాల దేదీప్య సాయి ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. 2024-2025 విద్యాసంవత్సరంలో ఇంటర్ ఫలితాల్లో కుప్పాల దేదీప్య సాయి వెయ్యి మార్కులకు 991 మార్కులు సాధించి జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని చెప్పారు. ఈ విద్యార్థిని ప్రతిభను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం జిల్లా నుంచి జనరల్ కేటగిరీలో కుప్పాల దేదీప్య సాయికి ప్రతిభా పురస్కారాన్ని ప్రకటించిందన్నారు.

గ్రామాలాభివృద్ధికి కృషి

మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - ముసునూరు

గ్రామాలాభివృద్ధికి కృషి చేస్తున్నామని రాష్ట్ర గృహ నిర్మాణ, పౌర సంబంధాల శాఖ మంత్రి వర్యులు కొలుసు పార్థసారథి చెప్పారు. మండలంలోని చెక్కపల్లి గ్రామంలో నిర్మించిన శ్రీ మురళీకృష్ణుని స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పార్థసారధి పాల్గొన్నారు. మొదటిగా గ్రామ పెద్దలు, యాత్రికులు, చిన్నారులు, వేదపండితులు భాజా భజంత్రీలు, మేళ తాళాలతో మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వచ్చే ఏడాది స్వామివారి సన్నిధిని సకల సదుపాయాలు, సౌకర్యాలతో అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం చెక్కపల్లి గ్రామ సచివాలయం వద్ద వనం మనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. అర్హులందరికి పెన్షన్లు ఇప్పించే బాధ్యత తనదన్నారు. అనంతరం గ్రామస్తులు మంత్రి దృష్టికి పలు సమస్యలు తీసుకెళ్లారు. గ్రామంలో రెవెన్యూ అర్హత కలిగిన సొంత భూములు అడంగల్, వన్ బి, ఆన్‌లైన్ విధానంలో చెరువు అని రాయడంతో బ్యాంకు రుణం తీసుకునే సమయంలో, ఏ ఇతర అమ్మకానికి ఉపయోగించుకునే సమయంలో ప్రభుత్వ చెరువు భూమి అని చూపించడం వల్ల రైతులందరం ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని, రెవెన్యూ సిబ్బంది తమ సమస్యను పరిష్కరించడం లేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ వంటివి చాలా ఆలస్యం చేస్తున్నారని, సకాలంలో సమాధానం చెప్పడం లేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రెవెన్యూ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో పొలాలకు, ఇళ్లకు ఒకే 11 కెవి విద్యుత్ సరఫరా ఉండటంతో వర్షం, గాలి వచ్చిన సమయంలో పొలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయగా గ్రామంలో కూడా నిలిపివేయడంతో ఇబ్బంది పడుతున్నామని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో మంత్రి విద్యుత్ శాఖ ఎఇ రాజకుమార్‌తో మాట్లాడి ఈ సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టారు. అదే గ్రామానికి చెందిన పిల్లి కనకయ్య కుమారుడు గత నాలుగైదు నెలల క్రితం చనిపోగా, మంత్రి దృష్టికి తీసుకురాగా మంత్రి రాష్ట్ర స్థాయి అధికారులతో ఫోన్‌లో మాట్లాడి నష్టపరిహారం వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గద్దె రఘుబాబు, తల్లిబోయిన సత్యనారాయణ, చిలుకూరు వెంకటేశ్వరరావు, కందుల పిచ్చియ్య, పాకనాటి రాజా, కొల్లి గంగారం, మెదరమెట్ల సురేంద్ర, కె.ప్రసాద్, కె.సత్యనారాయణ, కె.నాగేశ్వరరావు, పలు శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



నారాయణ స్కూల్ ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న ప్రముఖులు

నారాయణ స్కూల్ నూతన భవనం ప్రారంభం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణంలో నారాయణ స్కూల్ నూతన భవనాన్ని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ గురువారం ప్రారంభించారు. స్థానిక అశ్వారావుపేట రోడ్డులోని సోంబాబు పెట్రోల్ బంక్ పక్కన అన్ని హంగులతో నారాయణ ఒలింపియాడ్ స్కూల్ నూతన భవన ప్రారంభ కార్యక్రమం నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ విజయభాస్కరరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఎల్ఎ భవనాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ప్రమాణాలు, నాణ్యతతో కూడిన విద్యను అందించడంలో దశాబ్దాలుగా నిరంతరం కృషి చేస్తున్న నారాయణ విద్యాసంస్థలు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 200 బ్రాంచీలకు పైగా ఉన్న నారాయణ విద్యాసంస్థలు, డైరెక్టర్ శ్రీ పొంగూరి రమాదేవి ఆధ్వర్యంలో దినాదినభివృద్ధి చెందుతూ అనేక మంది విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారన్నారు. నూతన భవనంలో విశాలమైన తరగతి గదులు, ల్యాబ్స్, కిడ్స్ ఫన్ స్టేషన్, విశాలమైన క్రీడా మైదానం ఆడియో విజువల్ ల్యాబ్స్, డిజిటల్ తరగతి గదులు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా ఎజిఎం పి.రామిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విజయవంతంగా అన్ని అవకాశాలను అందిపుచ్చుకోవడానికి, ఉన్నత శిఖరాలను చేరుకోవడానికి ఇంటిగ్రేటెడ్ సిలబస్‌తో కూడిన కరిక్యులం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ వి.లక్ష్మీనారాయణరెడ్డి, ఆర్ఐ శ్రీనివాస్, ఎఒ పవన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పార్టీ సీనియర్ నాయకులు కరాటం రాంబాబు, మండవల్లి సోంబాబు, మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి పాల్గొన్నారు.



బాలల గ్రంథాలయంలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

ఘనంగా వేసవి విజ్ఞాన తరగతులు

ప్రజాశక్తి - ఏలూరు

వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఏలూరు బాలల గ్రంథాలయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కారంశెట్టి రమేష్‌బాబు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. గ్రంథాలయ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం హేలాపురి బాలోత్సవం కమిటీ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. వివిధ పోటీల్లో గెలు పొందిన విద్యార్థులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా ఈ నెల ఆరో తేదీన బహుమతులు అందించనున్నట్లు గ్రంథాలయ నిర్వాహకురాలు మణిపూరి శోభ తెలిపారు.

దెందులూరు : పెదపాడు శాఖ గ్రంథాలయంలో ఉచిత వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా 33వ రోజు గురువారం విద్యార్థులు ఉత్సాహంగా ఉల్లాసంగా పాల్గొన్నారు. రిసోర్స్ పర్సన్ డి.రేణుక ఎల్లమ్మ మన్యం వీరుడు "అల్లూరి సీతారామరాజు" జీవిత చరిత్రను విపులంగా వివరించారు. అనంతరం నరిశేపల్లి లక్ష్మీనారాయణ రచించిన"మాటలు నేర్చిన చిలుక"అనే పుస్తకం నుండి "మానవసేవే మాధవసేవ" "ఆశల పల్లకి"అనే కథలను రిసోర్స్ పర్సన్స్ అట్లూరి సతీష్ కుమార్, కుమారి నీలాద్రి నాగ పావని చదివి వినిపించారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం" సందర్భంగా గ్రంథాలయ అధికారి దుగ్గిపోగు జాన్‌బాబు గ్రంథాలయ ఆవరణలో చెట్లను నటించారు. ఈ కార్యక్రమంలో 45 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం గ్రంథాలయ అధికారి దుగ్గిపోగు జాన్‌బాబు పర్యవేక్షణలో నిర్వహించారు. విద్యార్థులకు స్నాక్స్ పంచిపెట్టారు.

నేరాలు - ఘోరాలు

ఫర్నీచర్ దుకాణంలో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఫర్నీచర్ దుకాణంలో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి భారీగా మంటలు ఎగిసిపడి భారీగా ఆస్తి నష్టం సంభవించింది. ఈ ఘటన గురువారం రాత్రి ఏలూరు రూరల్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు రూరల్ మండలం బీడీ కాలనీ ప్రాంతానికి చెందిన మాదాబత్తుల వెంకటేష్ ఏలూరు రూరల్ పరిధిలో జెఎంజె స్కూల్ సమీపంలో గణేష్ సోఫా అండ్ ఫర్నీచర్ వర్క్స్ పేరుతో సోఫా ఫర్నీచర్ దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి దుకాణంలో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దుకాణంలో పనిచేస్తున్న కార్మికులు ప్రాణభయంతో బయటికి పరుగులు తీశారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది మూడు ఫైర్ ఇంజన్ల సహాయంతో మంటలను అదుపు చేశారు. ఆస్తి నష్టం అంచనాను అధికారులు ఇంకా అధికారికంగా ధ్రువీకరించలేదు.

కలుపు మందు తాగి వ్యక్తి మృతి

టి.నరసాపురం : కలుపు మందు తాగి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బండివారిగూడెం గ్రామానికి చెందిన పెనుమత్స శ్రీనివాస్‌రాజు 952) అతని భార్య 20 ఏళ్ల క్రితం విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి శ్రీనివాస్‌రాజు తల్లితో పాటు ఉంటున్నాడు. ఈ క్రమంలో ఒంటరి తనం భరించలేక మద్యానికి బానిసై చనిపోవాలనే ఉద్దేశంతో గ్రామం శివార్లలో పెనుమత్స వెంకట రామ రాజు కోళ్ల ఫారం వద్ద కలుపు మందు తాగాడు. గమనించిన అతని అన్నయ్య కారులో జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుని తల్లి శకుంతల ఫిర్యాదుతో హెడ్ కానిస్టేబుల్ ఎం.రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'మానస'లో ఉన్నత విద్యాప్రమాణాలు

హైస్కూల్ ప్రిన్సిపల్ యలమర్తి రవీంద్రకుమార్



రవీంద్రకుమార్

ప్రజాశక్తి - భీమడోలు

మానస ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఉన్నత విద్యాప్రమాణాలు అందిస్తున్నామని పాఠశాల ప్రిన్సిపల్ యలమర్తి రవీంద్రకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. సుమారు 90 మంది విద్యార్థులతో 2002లో మానస ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ఆ రోజుల్లోనే భీమడోలు వంటి గ్రామంలో ఉన్నత విద్యాప్రమాణాలతో ప్రారంభమైందన్నారు. గ్రామస్థాయి విద్యార్థులకు కూడా విలువైన విద్యను అందించడం మాత్రమే కాకుండా విద్యార్థులు వివిధ రంగాల్లో ఉన్నత స్థానాన్ని సాధించేలా గత 23 సంవత్సరాలుగా పనిచేస్తూ ఉంది. గ్రామాల్లో ఉండే తల్లిదండ్రులకు అందుబాటులో ఉండే ఫీజులతో కార్పొరేట్ స్థాయి విద్య, ఐఐటి, నీట్ ఫౌండేషన్, సాంస్కృతిక అంశాలు, వసతులు, బస్సులు వంటి అన్ని సౌకర్యాలను అందిస్తూ ఉంది. ఇప్పటికే ఇక్కడ చదువుకుని వెళ్లిన విద్యార్థులు ఎందరో ఐఐటి, నిట్, నీట్ ర్యాంకులు సాధించడం, ప్రభుత్వ, ప్రయివేట్ రంగాల్లో మంచి ఉద్యోగాలు సాధించడం, విదేశాల్లో సైతం ఉన్నత స్థాయిలో ఉద్యోగాలు సాధించడం జరుగుతూ ఉంది. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు మంచి విద్యతో పాటు క్రమశిక్షణ, సత్ప్రవర్తన, మానవత్వం, సామాజిక స్పృహ, విలువలు కలిగి ఉండేలా మొదటి నుంచి శిక్షణ ఇస్తున్నారు. నేటి పోటీ ప్రపంచానికి కావాల్సిన కంప్యూటర్ శిక్షణ, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంగ్లీష్ భాషపై పట్టు, మూడో తరగతి నుంచే కాంపిటేటివ్ పరీక్షల విధానంలో తరచూ పరీక్షలు నిర్వహించడం, విద్యార్థులకు మానసిక వికాసానికి కావాల్సిన అనేక కార్యక్రమాలు, సాంస్కృతిక అంశాలు నిర్వహిస్తారు. విద్యార్థుల శారీరక వికాసానికి అలాగే పోటీతత్వాన్ని పెంపొందించడానికి చాలా రకాల ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ఇస్తారు. ఇలా అన్ని రంగాల్లోనూ కచ్చితమైన విధానాలు పాటించడాన్ని గుర్తించిన అప్పటి కలెక్టర్ 2017లో రాష్ట్ర ప్రభుత్వం తరపున తనకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కూడా ఇచ్చారని తెలిపారు. ఇలా భీమడోలు గ్రామంలో విద్యార్థులకు మానస ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ఒక విలువైన విద్యకు వేదికగా మారి ఇప్పుడు రెండు వేల మందికి పైగా విద్యార్థులకు విద్యను అందిస్తూ అ ప్రాంతంలోనే నెంబర్ వన్ స్కూలుగా నిలిచిందని చెప్పారు.




మానస ఇంగ్లీష్ మీడియం హైస్కూల్

విద్యార్థుల అభ్యున్నతే 'చైతన్య' లక్ష్యం

హైస్కూల్ కరస్పాండెంట్ నాగరాజు, డైరెక్టర్ నాగబాబు

ప్రజాశక్తి - ముసునూరు

గ్రామీణ విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యంగా గత పదేళ్లుగా సేవలందిస్తున్న ఏకైక విద్యా సంస్థ చెక్కపల్లిలోని చైతన్య ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ అని కరస్పాండెంట్ మరీదు నాగరాజు, డైరెక్టర్ కె.నాగబాబు అన్నారు. ఈ సందర్భంగా వారు ప్రజాశక్తితో మాట్లాడారు. ప్రశాంతమైన పచ్చటి గ్రామీణ వాతావరణంలో ఉపాధ్యాయులే డైరెక్టర్లుగా పనిచేస్తూ పదేళ్ల దిగ్విజయంగా పూర్తి చేసి 11వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్నామన్నారు. నమ్మకమే పెట్టుబడిగా భావించి తమ ఆకాంక్షను చదువు రూపంలో పెంపొందించేందుకు, విద్యార్థులు మంచి మార్కులు సాధించేందుకు కృషి చేస్తున్నామన్నారు. క్వాలిఫైడ్ అనుభవం కలిగిన ఉపాధ్యాయుల ద్వారా విద్యాబోధన చేస్తున్నామన్నారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు సిబిఎస్ఇ విద్యా విధానాన్ని అందిస్తున్నామన్నారు. చైతన్య ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో చదివే విద్యార్థులు వేరే ట్యూషన్ పాయింట్‌కు పరుగులు తీసే పని లేకుండా పాఠశాలలోనే ప్రత్యేక శ్రద్ధతో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. గురుకుల, నవోదయ పాఠశాలల్లో తమ విద్యార్థులు సీట్లు సాధించారన్నారు. స్కూలు పిల్లలందరూ ఇంగ్లీషులోనే మాట్లాడేలా, ఐఐటి ఫౌండేషన్ గురించి చిన్న తరగతుల నుంచి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ప్రతినెలా పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించి తల్లిదండ్రుల సలహాలు, సూచనలు పాటిస్తున్నామన్నారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో గత పదేళ్ల నుంచి నూటికి నూరు శాతం ఫలితాలు సాధించి మండల స్థాయిలోనే ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన ఘనత ఎన్నో ఏళ్ల నుంచి కొనసాగుతుందన్నారు. రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో సైన్స్ పరికరాల ప్రయోగాల కార్యక్రమంలో ఎన్నో ప్రత్యేక బహుమతులు కలెక్టర్, రాష్ట్ర మంత్రుల చేతుల మీదుగా తమ పాఠశాల విద్యార్థులు అందుకున్న ఘనత తమ పాఠశాలకే దక్కుతుందన్నారు. ప్రతిరోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు శిక్షణా తరగతులు నిర్వహించి, సాయంత్రం వేళ వ్యాయామ ఉపాధ్యాయుని ద్వారా చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆటలు పోటీలు నిర్వహించడం తమ ప్రత్యేకత అని చెప్పారు.



నాగరాజు



నాగబాబు

వెయ్యి మందికి ఉద్యోగాల కల్పన చరిత్రాత్మకం

పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనట్ల స్థాపనకు గిరిజన యువత ముందుకు రావాలి

జాబ్ మేళాలో కలెక్టర్ వెట్రిసెల్వి, పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన బుట్టాయగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉద్యోగ మేళాలో కలెక్టర్ కె.వెట్రిసెల్వి, పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు పాల్గొన్నారు. తొలుత అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎంఎల్ఎ చిర్రి బాలరాజు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ చంద్రబాబు పోలవరం పర్యటనకు వచ్చినప్పుడు నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీతో పాటు వారికి విద్య, ఉదోగావకాశాలు కల్పించాలని ఆదేశించారన్నారు. ఆ మేరకు గురువారం 12 మంచి పేరున్న కంపెనీలను తీసుకొచ్చి వెయ్యి మంది యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామన్నారు. వచ్చిన ఉద్యోగాన్ని ఒక మంచి అవకాశంగా తీసుకుని ఉన్నత శిఖరాలకు చేరాలన్నారు. ఉద్యోగం వద్దు అనుకుంటే పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు ముందుకు రావాలని, మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. ఇందుకోసం సర్వే నిర్వహించామని, రెండు వేల మంది ఉద్యోగాలు, ఉన్నత విద్య, స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా శిక్షణా కార్యక్రమాలు కావాలని కోరారన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఉన్నత విద్యకు దరఖాస్తులు చేసుకుంటే తప్పక పరిశీలించి ఉన్నత విద్యకు ప్రోత్సాహం అందిస్తామన్నారు. ఉద్యోగ మేళాలు జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో నిర్వహిస్తున్నామని, ఇది నిరంతర ప్రక్రియ అని యువత సద్వినియోగం చేసుకుని జీవితాన్ని అందంగా మలుచుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. ఎంఎల్ఎ చిర్రి బాలరాజు మాట్లాడుతూ ఎన్‌డి ప్రభుత్వం ఇచ్చిన హామీలు దశల వారీగా అమలు చేస్తుందన్నారు. నియోజకవరంలో రహదారులకు రూ.57 కోట్లు మంజూరై పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. వచ్చిన ఉద్యోగావకాశాన్ని సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరాలన్నారు. చదువు పూర్తయిన అనంతరం ఉద్యోగాల కోసం వివిధ కంపెనీలు చుట్టూ తిరిగే అవసరం లేకుండా చదువుకున్న కళాశాలల్లోనే జాబ్ మేళాలు నిర్వహించి పలు సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పించేలా ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసి సమర్థవంతంగా అమలు చేస్తుందన్నారు. ఈ సువర్ణ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకుని దేశానికి, రాష్ట్రానికి, జన్మనిచ్చిన గ్రామానికి మంచి సేవలందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఎంవి.రమణ, ఐటిడిఎ పిఒ కె.రాములునాయక్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఎన్.జితేంద్రబాబు, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి కె.ప్రవీణ్, వివిధ శాఖల అధికారులు, గ్రామ సర్పంచి తెల్లం వెంకాయమ్మ, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ కో- ఆర్డినేటర్లు వి.రవిశ్యామ్, ఆర్.ఫణికుమార్, ఎస్.సునీల్ కుమార్, కె.రాంబాబు, వి.కిషోర్, డి.రామకృష్ణ నాయుడు, వివిధ కంపెనీల ప్రతినిధులు, వారి టెక్నికల్ బృందం, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

భావితరాలకు చక్కని పర్యావరణాన్ని అందించే పనిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని బత్తులవారిగూడెంలోని నగరవనంలో అధికారులతో కలిసి మంత్రి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి పార్థసారధి మాట్లాడారు.అనంతరం ప్రజలతో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖాధికారి శుభమ్, నూజివీడు సబ్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్, మాజీ ఎంఎల్ఎ ఘంటా మురళీరామకృష్ణ, ఎంపిడిఒ, అటవీ శాఖ అధికారులు, పంచాయతీ సర్పంచి ఎం.లక్ష్మి పాల్గొన్నారు.

ఏలూరు సిటీ : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ ఏలూరు జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని అన్నారు. కార్య క్రమంలో జిల్లా పరిషత్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌ఛార్జి ఛైర్మన్, ఏడో అదనపు జిల్లా జడ్జి వై.శ్రీనివాసరావు అధ్యక్షతన గురువారం జిల్లా కోర్టు ప్రాంగణంలో పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ మాట్లాడారు. ఎనిమిదో అదనపు జిల్లా జడ్జి ఐ.శ్రీనివాసమూర్తి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి పిఎస్‌వి బి.కృష్ణసాయితేజ, ప్రిన్సిపల్, జూనియర్ సివిల్ జడ్జి మొహమ్మద్ అబు తాలిబ్ షేక్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కొనే సీతారాం, న్యాయవాదులు, ప్యానల్ లాయర్లు, పారా లీగల్ వాలంటీర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.శశిధర్ బాబు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు ఆలపాటి నాగేశ్వరరావు మాట్లాడారు. అనంతరం రెడ్ క్రాస్ వాలంటీర్లు, నర్సింగ్ కళాశాలల విద్యార్థులు, మానవత సభ్యులు ఆసుపత్రి ఆవరణలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.బెన్నీ, కమిటీ సభ్యులు ఎం.చంద్రశేఖర్, ఎం.అజయ్‌బాబు, డాక్టర్ వరప్రసాద్‌రావు, ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల ప్రిన్సిపల్ ఎన్. దీనాకుమారి పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : పట్టణంలో గురువారం నిర్వహించిన వన మహోత్సవంలో చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ పాల్గొన్నారు. మున్సిపాలిటీలో మొక్కలు నాటి నీళ్ల పోశారు. నాటిన మొక్కలను సంరక్షించుకునేందుకు ప్రజలంతా సమిష్టిగా కృషి చేయాలన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంతో పాటు మున్సిపాలిటీ ఆవరణలో ఎంఎల్ఎ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, టిడిపి పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ కమిషనర్, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఏలూరు సిటీ : ఏలూరు నగరాన్ని పచ్చదనంతో హరితవనంగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి, నగరరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు పిలుపునిచ్చారు. పర్యావరణం-పరిరక్షణ దినోతవ్సం కార్యక్రమంలో భాగంగా గురువారం పోణంగి డంపింగ్ యార్డ్ కాంపౌండ్ లోపల రోడ్డుకు పక్కగా ఉన్న ప్రాంతంలో అడవి లాగా (ఫారెస్ట్) తయారు చేసే విధంగా మొక్కలు నాటారు. అనంతరం టిడ్కో ఇల్లు ప్రాంతంలో రోడ్డు పక్కనే మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బడేటి చంటి, మేయర్ నూర్జహాన్ పెదబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు, ఇడ ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారధి, స్థానిక కార్పొరేటర్ దారపు అనూష తేజ, ఇన్‌ఛార్జి కమిషనర్ జి.చంద్రయ్య, డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి, ఎంఇ ఇ.సురేంద్రబాబు, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.



చింతలపూడిలో...

చింతలపూడి : వృక్షాలు నాటి పర్యావణాన్ని కాపాడాలని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. పట్టణంలోని జూనియర్ కాలేజీ గ్రౌండ్స్‌లో వన మహోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలను నాటడం ద్వారా పర్యావరణం కలుషితం కాకుండా కాపాడుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్, పట్టణ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. చింతలపూడి కోర్టు ఆవరణలో మండల న్యాయ సేవాధికార కమిటీ ఛైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్.మధుబాబు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.మాణిక్యాలరావు, కోర్టు సూపరింటెండెంట్ పిజి.నాయుడు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పిఎల్‌వి.అక్బర్‌ఆలీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉంగుటూరు: పచ్చదనం పర్యావరణం కాపాడే విధంగా ప్రతిఒక్కరూ మొక్కను నాటి పెంచి పోషించాలని ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ప్రపంచ పర్యావరణం దినోత్సవం సందర్భంగా నారాయణపురంలో నీడనిచ్చే మొక్కలను ధర్మరాజు నాటారు. నియోజకవర్గంలో 60 వేల మొక్కలు నాటించి వాటి చుట్టూ ట్రీ గార్డు ఏర్పాటు చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ఎంఎల్ఎ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి దిడ్ల అలకనంద, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ చింతల వాసు, ఎంపిడిఒ రాజ్‌మనోజ్, శరణాల మాలతీరాణి, వార్డు సభ్యులు, జనసేన నాయకులు సూరత్తుల అయ్యప్ప, బొమ్మిడి అనిల్‌కుమార్, ఎపిఒ ఖాజావలీ, ఉపాధి కూలీలు, అటవీశాఖ, పంచాయతీ అధికారులు, కూటమి నాయకులు గోలి శ్రీను, అక్కిన నాగమణి పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ నిఖిల్ మధు శరణ్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని బర్రింకలపాడు, దర్భగూడెం సచివాలయాల పరిధిలో వనం మనం కార్యక్రమంలో భాగంగా అటవీ శాఖాధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సెక్షన్ అధికారి రాంబాబు, సర్పంచులు సున్నం ఉషా రాణి, జగదాంబ, ఎంపిటిసి సభ్యులు సురేష్, ఎపిఎం ఝాన్సీ, ఎపిఒ జాన్ వెస్లీ, బీట్ అధికారులు, మారేష్, ఏసుపండు, లలిత, అటవీ శాఖ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



నూజివీడులో...

వేలేరుపాడు : స్థానిక తహశీల్దార్, ఎంపిడిఒ, పంచాయతీ కార్యాలయాలు, సచివాలయాలు, అంగన్వాడీ సెంటర్లలో టిడిపి నాయకులు, అధికారులు పాల్గొని మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు అమరవరపు అశోక్, సర్పంచి సోడే వెంకమ్మ, శాఖమూరి సంజీవులు, కొమ్మన వెంకటేశ్వరరావు, కరటూరి రాధాకృష్ణ, పసుపులేటి లక్ష్మయ్య, కట్టం రాంబాబు, బడిగంటి వెంకటేశ్వరరావు, కోటిపల్లిముత్యాలరావు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు గణేశుల ఆదినారాయణ, క్రాంతి కుమార్, ఆర్ఐ భుజంగరావు, ఎంపిడిఒ శ్రీహరి, ఎఫ్‌బిఒలు సాగర్, సతీష్ పాల్గొన్నారు.

టి.నరసాపురం : పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మండలంలోని వెలగపాడు, బొర్రంపాలెం, వల్లంపట్ల పంచాయతీల్లో గురువారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మల్లుకుంట సొసైటీ సిఇఒ కెవివి.సత్యనారాయణ, వెలగపాడు సర్పంచి నైనారపు జలపాలు, గండబోయిన శ్రీను, పేరుబోయిన శ్రీనివాసరావు, చవల అప్పలరాజు, శేషు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా మండల పరిధిలోని పలు కార్యాలయాలు, పాఠశాలలు, సచివాలయాల వద్ద మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. బొద్దనపల్లి ఎంపియుపి పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపిడిఒ పి.భార్గవి మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు నక్కనబోయిన వేణు, ఎన్.హరిబాబు, కె.బాబూరావు, ఎస్.రంగారావు, జనసేన మండల ఉపాధ్యక్షుడు ఎం.మహేష్, ప్రధానోపాధ్యాయురాలు యామిని పాల్గొన్నారు.

కలిదిండి : మండలంలోని మట్టగుంటలో పంచాయతీ, అంగన్వాడీ, రైతుభరోసా కేంద్రాల వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాసరావు మాట్లాడారు. నాయకులు తిరుమాని పాండురంగారావు, ఒడుగు గణపతి, బళ్లా రాజు, సత్యనారాయణ, కార్యదర్శి గంగాశంకర్, సచివాలయం, ఆశా, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ముదినేపల్లి : మండలంలోని వడాలి గ్రామ సచివాలయం వద్ద కైకలూరు నియోజవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వడాలి సర్పంచి దుర్గాశ్రీ, సచివాలయం సిబ్బంది, పాల్గొన్నారు.

పామాయిల్‌కు మద్దతు ధర కల్పించాలి

కేంద్ర వాణిజ్య శాఖ కార్యదర్శికి

ఏలూరు ఎంపీ వినతి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

పామాయిల్ సాగు చేస్తున్న రైతులకు కనీస మద్దతు ధర కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కేంద్ర వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ బర్త్వాల్‌కు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఢిల్లీలోని వాణిజ్య భవన్‌లో సునీల్ బర్త్వాల్‌ను కలిసి వినతిపత్రం అందించారు. 2025 మే 31న విడుదలైన కస్టమ్స్ డ్యూటీ తగ్గింపు నోటిఫికేషన్‌ను వెనక్కి తీసుకుంటూ, క్రూడ్ ఎడిబుల్ ఆయిల్స్‌పై 50 శాతం కస్టమ్స్ డ్యూటీ విధించడం ద్వారా రైతులకు ప్రతిమెట్రిక్ టన్నుకు రూ.22 వేలు లభించే అవకాశం ఉందని కేంద్ర వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ బర్త్వాల్ దృష్టికి ఎంపీ మహేష్ కుమార్ తీసుకెళ్లారు. ఆంధ్రప్రదేశ్‌లో పామాయిల్ సాగు చేస్తున్న రైతులు, ముఖ్యంగా ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించిన వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఎంపీ వివరించారు. దిగుమతులపై సుంకాన్ని 27.5 శాతం నుంచి 16.5 శాతానికి తగ్గించడం వల్ల రెండు నెలల్లోనే కనీస మద్దతు ధర రూ.1.25 లక్షల నుంచి రూ.1.11 లక్షలకు తగ్గిందని ఎంపీ తెలిపారు. విదేశీ మారకాన్ని ఆదా చేయాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పామాయిల్ పంట సాగును ప్రోత్సహిస్తున్నాయని, 1986లో మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు తొలిసారి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గంలోని పెదవేగి మండలంలో ఆయిల్‌పామ్ సాగును ప్రారంభించారని ఎంపీ మహేష్ కుమార్ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. 1990లో కేంద్ర బయోటెక్నాలజీ శాఖ తొలిసారిగా ఎపిలో వెయ్యి హెక్టార్లలో పామాయిల్ సాగుకు ప్రోత్సాహకంగా రాయితీలు, కనీసం మద్దతు ధర హామీ ఇచ్చిందని ఎంపీ వివరించారు. ప్రస్తుతం 2.5 లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు చేస్తున్నారని, 2.5 లక్షల మంది రైతులు నేరుగా, మరో పది లక్షల మంది పరోక్షంగా జీవిస్తున్నారని ఎంపీ తెలిపారు. ఈ నేపథ్యంలో పామాయిల్ రైతులను ఆదుకునే దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎంపీ కోరారు.

బాస్కెట్‌బాల్ పోటీల్లో నూజివీడు బాలికల సత్తా

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

చిత్తూరులో ఈ నెల 4, 5 తేదీల్లో నిర్వహించిన అండర్ 23 బాస్కెట్‌బాల్ మొదటి ఛాంపియన్‌షిప్ పోటీల్లో కృష్ణాజిల్లా బాలికల జట్టు తూర్పు గోదావరిపై విజయం సాధించినట్లు సీనియర్ పీడీ, కోచ్ డాక్టర్ వాకా నాగరాజు తెలిపారు. నూజివీడులో ఆయన గురువారం మాట్లాడుతూ కృష్ణాజిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన నలుగురు బాలికలు నూజివీడులోని శ్రీ మాడపాటి వెంకటేశ్వరరావు పంతులు విక్టోరియా టౌన్ హాల్ (విటిహెచ్) గ్రౌండ్స్‌కు చెందిన క్రీడాకారులుగా వివరించారు. బి.ప్రభుదీపిక, ఎస్‌కె.అస్ర, బి.ప్రణవి, బి.కుసుమలు నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో బాస్కెట్‌బాల్ క్రీడాంశంలో విస్తృతమైన కృషి చేసినట్లు తెలిపారు. నూజివీడు ప్రాంతం నుంచి గతంలోనూ అనేకమంది బాస్కెట్ బాల్ క్రీడాకారులు జాతీయస్థాయిలో మెరిసి అద్భుతమైన ప్రతిభ కనపరచినట్లు చెప్పారు. వారంతా వివిధ శాఖల్లో స్థిరపడి ఉన్నతమైన జీవితాన్ని పొందినట్లు వివరించారు. ఆ దిశగా క్రీడాకారులను తయారు చేసేందుకు అనునిత్యం కృషి చేస్తున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఏలూరు : ఏలూరు శాంతినగర్ సెక్షన్ పరిధిలో ఉన్న 33/11 కెవి శాంతినగర్ సబ్ స్టేషన్, ఫీడరు మరమ్మతుల నిమిత్తం ఈ నెల ఆరో తేదీ శుక్రవారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏలూరు ఆపరేషన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.అంబేద్కర్ తెలిపారు. ఆ సమయంలో ఆ సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న శాంతినగర్, జెవిఆర్ నగర్ ప్రాంతాలకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

In The Court Of The Junior Civil Judge (Junior Division) at Bhimadole, Eluru Dt

I.A.No. 671/2024 in O.S.No. 99/2024

Between:

శనపతి పైడమ్మ ...వాది

మరియు

యనమండ్ర రామలక్ష్మి వగైరాలు ...ప్రతివాదులు

To:

1. యనమండ్ర రామలక్ష్మి, W/o. (లేటు) దుర్గాప్రసాద్, శాంతి కాన్వెంట్ వద్ద, భీమడోలు, భీమడోలు మండలం. (D1)
2. యనమండ్ర విశ్వతేజ, S/o. (లేటు) దుర్గాప్రసాద్, శాంతి కాన్వెంట్ వద్ద, భీమడోలు, భీమడోలు మండలం. (D2)
3. యనమండ్ర వైష్ణవి, D/o. (లేటు) దుర్గాప్రసాద్, శాంతి కాన్వెంట్ వద్ద, భీమడోలు, భీమడోలు మండలం. (D3)

పై నెంబరు దావాను వాది అయిన శనపతి పైడమ్మ గారు భీమడోలు కోర్టులో ప్రతివాదులపై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావా గ్రంథములో 1వ, 2వ, 3వ ప్రతివాదులైన 1. యనమండ్ర రామలక్ష్మి, 2. యనమండ్ర విశ్వతేజ, 3. యనమండ్ర వైష్ణవి భీమడోలు వార్కి నోటీసు నిమిత్తం **ది. 25-06-2025 తేదీకి** వాయిదా అయివున్నది. దావాలో చనిపోయిన యనమండ్ర దుర్గాప్రసాద్ కు రైల్వే డిపార్టుమెంటు నుండి రావలసిన బెనిఫిట్స్ అన్నియు ఎటాచ్ చేయమని వాది గారు కోర్టులో పై ముగ్గురు ప్రతివాదులపై I.A.No. 671/2024 ను దాఖలు చేసియున్నారు. కావున 3గురు ప్రతివాదులు కోర్టు వారు ఎదుట **ది. 25-06-2025 తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** హాజరై తమకు గల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల వారిని ఎక్స్‌పార్టీ చేసి దావా తీర్మాణము చేయబడును.

(శ్రీ కోర్టు వారు ఆర్డరు ప్రకారం)

శ్రీ ఆల్తి శ్రీనివాస్
శ్రీమతి సుధారాణి
వాది తరుపు న్యాయవాదులు, భీమడోలు

భీమడోలు
ది.22-05-2025
సెల్ నెం: 94909 98949